
ప్రజాశక్తి
సోమవారం 16 సెప్టెంబర్ 2024
5
విజయనగరం



చిరు వ్యాపారులు అద్దె చెల్లించొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ స్థలాల్లో బడ్డీలు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు ఇతర వ్యక్తులకు గాని, దుకాణదారులకు గాని అద్దెలు, రుసుములు చెల్లించవద్దని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటివరకు కార్పొరేషన్ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల నుంచి తాత్కాలిక ఆక్రమణ ఫీజులను నగరపాలక సంస్థ అధికారులు వసూలు చేస్తారని తెలిపారు. కార్పొరేషన్ స్థలాలు ఆక్రమించి కొత్తగా వ్యాపారాలు చేస్తే మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ రహదారులను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యను సృష్టించవద్దని కోరారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై బడ్డీలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారాలు సాగిస్తే సహించబోమని హెచ్చరించారు.

జిల్లా క్రికెట్‌లో సెలెక్టర్ల తీరు నానాటికి తీసికట్టుగా మారుతోంది. విశాఖ జిల్లాలోని తమ స్నేహితులైన వటేకర్, బిపి శ్రీనివాస్, బొర్రయ్య క్రికెట్ అకాడమీల నుంచి వస్తున్న ప్లేయర్లకు సెలెక్టర్లు అవకాశాలు కల్పిస్తూ, జిల్లా క్రీడాకారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారనేది జగమెరుగని సత్యం. అనేక ఏళ్లుగా పత్రికల్లో, మీడియాలో సెలెక్టర్ల తీరుపై కథనాలు వచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు. డబ్బులు ఎవరిస్తారో వారిపై మాత్రమే సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నారు. అందుకే విశాఖ బి జట్టుగా జిల్లా జట్టు మారిందనే నింద ఎప్పటి నుంచో ఉంది. ఇప్పటికే విజయనగరం క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్ల తీరుపై ఆగ్రహంతో ఉన్న క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు.. పోరాటానికి సిద్ధమవుతున్నారు.



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్యాష్ కొట్టు.. జట్టులో చోటు పట్టు



- డబ్బే పరమావధిగా సెలెక్టర్లు
- ఇష్టారాజ్యంగా క్రికెట్ జట్ల ఎంపిక
- ప్రతిభను తొక్కేస్తున్న వైనం
- విశాఖ 'బి' జట్టుగా మారుతున్న జిల్లా టీం
- పోరుకు సిద్ధమవుతున్న క్రీడాకారులు, తల్లిదండ్రులు

విజయనగరం అండర్-14 జట్టు కోసం ప్రకాశం జిల్లాకు చెందిన ప్రస్తుతం భీమిలిలో ఉంటున్న మహేంద్ర అనే వ్యక్తిని తమకు అనుకూలంగా ఉంటాడని సెలెక్టర్లు కోచ్‌గా తీసుకొచ్చారు. ఆడటానికి విశాఖ నుంచి క్రీడాకారులను తీసుకొస్తున్నారు. ఇన్ని చేశాక అది విజయనగరం జిల్లా జట్టు ఎందుకవుతుందని క్రీడాకారుల తల్లిదండ్రుల ప్రశ్న.


విజయనగరానికి చెందిన ప్రీతం రాజ్ గతేడాది అండర్-16లో రాష్ట్రానికి ఆడాడు. ఈ ఏడాది అండర్-19 జిల్లా జిల్లా జట్టుకు ఎంపిక చేయలేదు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్లు ఎలా ఎంపికలు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో అండర్-14, 16, 19, 23, సీనియర్స్.. ఇలా అన్ని విభాగాల్లో జిల్లా క్రికెట్ జట్టు సభ్యులు 11 మంది ఉంటే, వారిలో విశాఖ జిల్లా వారే 6 నుంచి 8 మంది వరకు ఉంటున్నారనే విమర్శ ఉంది. అది వాస్తవం కూడా. అసోసియేషన్ నాయకులకు క్రికెట్‌పై అవగాహన లేకపోవడంతో దానిని క్రికెట్ సెలెక్టర్లు తమకు అనుకూలంగా మార్చుకొంటున్నారు. స్వలాభం కోసం ఇతర జిల్లాల వారికి ప్రాధాన్యత ఇస్తూ మన జిల్లా క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నారు.

'సర్ఫ్‌రాజా'లే కారణం

ప్రకాశం జిల్లాకు చెందిన మహేంద్ర అనే వ్యక్తి ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీ ఉద్యోగి. ఆయన రాహుల్ ద్రావిడ్ క్రికెట్ అసోసియేషన్ పేరుతో అకాడమీని నడుపుతూ మెల్లగా ఇక్కడ అసోసియేషన్ పెద్దల ప్రాపకం పొందాడు. ఇతర జిల్లాలకు చెందిన క్రీడాకారులను జిల్లా జట్టులోకి సెలెక్టర్ల సహకారంతో పంపిస్తున్నాడు. ఇటీవల జరిగిన అండర్ -14 ఎంపికలకు సైతం ఆయననే కోచ్‌గా నియమించడం కొసమెరుపు. జిల్లా సెలక్షన్ తీరు చూస్తే దొంగ చేతికి తాళాలు అప్పగించిన వైనంగా మారిందని సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనంతటికీ మూల కారణం కొంతమంది 'సర్ఫ్‌రాజా'లేనని తెలుస్తోంది. వారి స్నేహబాంధవ్యాల తీరుతో జిల్లా క్రీడాకారుల భవితవ్యాన్ని మింగేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అకాడమీలతో లాలూచీ

సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో జిల్లా క్రీడాకారులను, తల్లిదండ్రులను సెలెక్టర్లు మోసం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులని తెలిసినా, వారివి నకిలీ సర్టిఫికెట్లని గుర్తించినా.. బయటవారిని ఆడించాలి అనుకుంటున్నారు కాబట్టి వారినే ఎంపిక చేస్తున్నారు. అదే నెపంతో జిల్లా ప్లేయర్లను తొక్కేస్తున్నారని క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పోర్ట్ ఉద్యోగి, అదే జిల్లా నుండి 69 రంజీ మ్యాచులు ఆడిన వాటేకర్ కుమారుడు మన్నా హేమంత్‌ని ఈ ఏడాది విజయనగరం జిల్లా అండర్-16 జట్టులో ఆడిస్తున్నారు జిల్లా సెలెక్టర్లు. మన్నా హేమంత్ ఎన్ని సర్టిఫికెట్లు పెడితే మాత్రం మన జిల్లా ప్లేయర్ అవుతాడా? అని జిల్లా క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి స్టడీ సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన జిల్లాకు ఆడించాలని నియమం ఎక్కడా లేదు. ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్న వారిని విశాఖ క్రికెట్ అసోసియేషన్ ఆడించదు. కారణం వారి జిల్లా ప్లేయర్లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. జిల్లా జట్టులో ఆరుగురి నుంచి 8 మంది వరకు విశాఖ జిల్లా క్రీడాకారులు మాత్రం ఉంటున్నారు. దీనికి ప్రధాన కారణం అక్కడ అకాడమీ కోచ్‌లతో మన సెలక్టర్లలో కొంతమంది లాలూచీ పడటమేనని తెలుస్తోంది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శికి క్రికెట్‌పై అవగాహన లేకపోవడం వల్ల సెలెక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదులకు సిద్ధం!

జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్ల తీరుతో విసిగిపోయిన క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఇటీవల కరపత్రాలు పంపిణీ చేశారు. సెలెక్టర్లు జిల్లా క్రీడాకారులకు చేస్తున్న అన్యాయంపై, పిల్లల కోసం తల్లిదండ్రులు పడుతున్న వేదనను తెలియజేస్తూ కరపత్రాలు వేసి పంపిణీ చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యేల దృష్టికి జిల్లా క్రికెట్ అసోసియేషన్, సెలెక్టర్ల తీరు వెళ్లినట్లు తెలిసింది. మరోవైపు జిల్లాలోని మంత్రికి, ఎమ్మెల్యేలకు క్రీడాకారులు, తల్లిదండ్రులు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా క్రికెట్ అసోసియేషన్‌పై దృష్టి సారించి జిల్లా క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

భావితరాలకు మార్గదర్శి మోక్షగుండం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

భావితరాలకు మార్గదర్శి మోక్షగుండం విశ్వేశ్వరయ్యని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే వేడుకలను ఇంజినీర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విగ్రహానికి మజ్జి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, ఇఇ ఎస్.కవిత, పిఆర్ ఇఇ శేఖర్, రిటైర్డ్ ఎస్ఇలు శివానంద్ కుమార్, విజయకుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మినిస్టీరియల్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తరువాత జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సభలో మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆనాటి కాలంలో మోక్షగుండం చేసిన పనులు భావితరాలకు మార్గదర్శిగా ఉన్నాయని తెలిపారు. అందుకే నేటితరం ఇంజినీర్లు భావితరాలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి వారికి మంచి స్ఫూర్తి నింపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బి.ఉమాశంకర్, ఎ.కళ్యాణ్ చక్రవర్తి, ఇఇ శేఖర్, రిటైర్డ్ ఎస్ఇలు విజయకుమార్, శివానంద్ కుమార్, దివాకర్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జీవితంలో చేసిన సేవలను కొనియాడారు. బాగా పనిచేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మెమోంటోలను జెడ్‌పి చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ఇంజినీర్స్ ఫోరం నాయకులు యెడ్ల గోవిందరావు, రమణ ప్రభాత్, అప్పారావు, శారద, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు పంపిణీ సంస్థలో ఇంజినీర్స్ డే

నగరంలోని తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఎస్ఇ కార్యాలయంలో ఇంజినీర్స్ డేను నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇఇలు పి.హరి, జి.సురేష్, డిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి శంకరరావు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల పక్షపాతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని, కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయడమే ఆయనకు కార్మిక వర్గం ఇచ్చే ఘనమైన నివాళని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఆదివారం నగరంలోని రామకృష్ణానగర్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి రెడ్డి శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన సీతారాం ఏచూరి ప్రజా ఉద్యమాలు నిర్వహించి అండగా నిలబడ్డారని తెలిపారు. కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తన గళం విప్పారని గుర్తుచేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని సమసమాజం కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శాంతమూర్తి, జగదాంబ, కర్రి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023-24కు గాను ప్రకటించిన వివిధ విభాగాల్లో అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల వ్యక్తులు, సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఎపి టూరిజం వెబ్‌సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీలోగా అందజేయాలని కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్

తైక్వాండోలో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 8 నుంచి పదో తేదీ వరకు జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు ఆగ్రాలో జరిగాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులకు పతకాల పంట పండింది. కె.సాహిత్య బంగారు, కాంస్య పతకాలు, పి.పునీత్ వెండి, 2 కాంస్య పతకాలు, వి.కుషాల్ - వెండి, కాంస్య పతకాలు, ఎస్.సాత్విక్ వెండి పతకం సాధించారు. వీరిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. రాబోయే ఇతర జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని మన జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాల్ రావు, అవనాపు విజయ్, కోచ్‌లు సిహెచ్ యశస్విని, గోపి, గగన్ ఈ కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

చెరువులను పరిరక్షించాలి

ఎమ్‌పి, ఎమ్మెల్యేలకు వినతులు



ఎమ్‌పి అప్పలనాయుడుకు వినతి అందిస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్రలో చెరువుల పరిరక్షణకు సహకరించాలని విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజును చెరువుల పరిరక్షణ సమితి నాయకులు కోరారు. ఆదివారం ఎమ్‌పి, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఉత్తరాంధ్రలోని పేదరికానికి, వలసలకు ప్రధాన కారణం నీటి వనరులను సద్వినియోగం చేసుకోకపోవడమేనని ఎమ్‌పి అప్పలనాయుడు తెలిపారు. నీటి వనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్రలోని కలెక్టర్లకు లేఖ రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు ఇప్పలవలస గోపాలరావు, మాత గాయత్రి, బుజ్జి, శ్రీను, శివ పాల్గొన్నారు

ప్రమాదాల కారణాలను అన్వేషించండి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలకు కారణాలను అన్వేషించి, నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. ఒక ప్రకటనలో సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, మరణాలు సంభవించిన ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా పోలీసుశాఖ గుర్తించిందని తెలిపారు. బ్లాక్ స్పాట్లను సంబంధిత డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, మున్సిపల్, రోడ్లు భవనాల శాఖ, రవాణశాఖ అధికారులు సంయుక్తంగా సందర్శించాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో తరుచూ రహదారి ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి ఆదేశాలతో అధికారులు జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ తనిఖీలు చేపట్టి, ప్రమాదాలు జరుగుటకు కారణాలను గుర్తించే చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సంబంధిత డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, సిఐలు, ట్రాఫిక్ పోలీసులు, ఎస్ఐలు, రవాణా, ఎన్‌హెచ్‌ఎ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వరద బాధితుల సహాయార్థం జనవిజ్ఞాన వేదిక, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎరుకొండ ఆనంద్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సామాజిక స్పృహతో ఈ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, ఆప్ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్ కుమార్, జిల్లా గ్రంథాలయం సంఘం మాజీ అధ్యక్షులు రొంగలి పోతన్న పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు. జెవివి నగర అధ్యక్ష, కార్యదర్శులు షిణగం శివాజీ, పి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.లక్ష్మణరావు, జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎ.వి రాజశేఖర్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ గంద్రేటి శ్రీనివాసరావు, జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు, కర్రీ సత్యనారాయణ, సీరాపు శ్రీనివాసరావు,పార్వతీపురం జెవివి నాయకులు రంజిత్ కుమార్, పైడినాయుడు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు భవాని, ఝాన్సీ, గుప్త, దివాకర్, మమ్ముల తిరుపతి పాల్గొన్నారు.

యోగా క్రీడాకారులకు అభినందన



యోగాలో ప్రతిభ కనబరిచిన వారితో అవనాపు విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర 49వ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో వరుసగా 3, 4, 6వ స్థానాలు సాధించిన జిల్లా యోగా క్రీడాకారులను జిల్లా యోగా సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ అభినందించారు. విశాఖ యోగా స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చుక్క సంధ్యారాణి (3వ స్థానం), మూడడ్ల రూపవతి (3వ స్థానం), మజ్జి గౌతమి (4వ స్థానం), శీర భారతి (4వ స్థానం), కొల్లుబోని భవాని(6వ స్థానం) ప్రతిభ కనబరిచారు. అక్టోబర్‌లో కటక్‌లో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీలకు వారు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఒలింపిక్ క్రీడా సంఘం కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భమిడిశెట్టి సన్యాసిరావు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

సైనిక క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం గుర్తింపు

- మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం
- 61 మందికి పిఎం స్కాలర్‌షిప్
- దేశ రక్షణకు యువత కదలాలి
- 'ప్రజాశక్తి'తో జిల్లా సైనిక సంక్షేమాధికారి పి.సత్యప్రసాద్ ముఖాముఖి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దేశ రక్షణ రంగంలో పనిచేసేందుకు యువత కదలిరావాలని ఉమ్మడి విజయనగరం జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ కోరారు. కేవలం ఉద్యోగ, ఉపాధి కోసం కాకుండా దేశానికి సేవలందించాలనే కాంక్షతో చేరితే ఆ మేరకు మేలు జరుగుతుందని అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సైనికులు, మాజీ సైనికుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటుకు 40 సెంట్ల స్థలాన్ని గుర్తించామని వివరించారు. ఇళ్ల స్థలాల సమస్య కూడా త్వరలో కొలిక్కి వస్తుందని, ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. దేశం కోసం కష్టపడి పనిచేస్తున్న సైనిక కుటుంబాల సంక్షేమానికి భారత ప్రభుత్వం పలు పథకాలు కూడా అమలు చేస్తోందన్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రస్తుతం 61 మంది విద్యార్థులకు పిఎం స్కాలర్‌షిప్ అందుతోందని చెప్పారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

? ఉమ్మడి విజయనగరం జిల్లాలో మాజీ సైనికులు ఎంత మంది ఉన్నారు.?


విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో మొత్తంగా 3305 సైనిక కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం సైనికులుగా పనిచేస్తున్నవారు 2,818 మంది. మాజీ సైనిక కుటుంబాలు 487 ఉన్నాయి. వీరందరికీ సైనిక సంక్షేమ బోర్డు తరపున నిరంతర సేవలు అందుతున్నాయి.

? సైనికుల్లో జిల్లా, విభాగాల వారీగా ఎంతమంది ఉన్నారు?

ఉమ్మడి జిల్లాలో 2,818 మంది సైనికులు ఉండగా, వీరిలో అత్యధికంగా విజయనగరం జిల్లాకు చెందినవారు 2,251 మంది ఉన్నారు. ఇందులో ఆర్మీలో 1,762 మంది, నేవీలో 270మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 219 మంది ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 567 మంది ఉంటే, అందులో ఆర్మీలో 467మంది, నేవీలో 60మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 40మంది ఉన్నారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో సైనికులు చాలా తక్కువ మంది ఉన్నారని చెప్పొచ్చు.

? ఇళ్ల స్థలాల ప్రతిపాదన ఎంత వరకు వచ్చింది.?

ఉద్యోగ విరమణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు పొందేందుకు అవకాశం ఉంది. ఈ విధంగా ఎంతో మంది స్థలాలు పొందారు. ఇంకా పెండింగ్‌లో ఉన్నవారి కోసం విజయనగరం జిల్లా కేంద్రంలోని గాజులరేగలో స్థలాలు ఇచ్చేందుకు చాలా ఏళ్ల క్రితమే ఫైలు నడిచింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సమీపంలో వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించిన స్థలం పక్కన 301 మంది మాజీ సైనిక కుటుంబాల వారికి స్థలాన్ని కూడా గుర్తించారు. ప్రభుత్వమే ఆమోదం తెలిపినప్పటికీ అధికారికంగా సబ్‌డివిజన్ కాలేదు. ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు కలెక్టర్, మంత్రి శ్రీనివాస్ దృష్టిలో పెట్టాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు. త్వరలో పట్టాలు అందుతాయని ఆశిస్తున్నాం.



? జిల్లాలో సైనిక క్యాంటీన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందా.?

ఔను! ఈ ప్రాంతంలోని సైనిక కుటుంబాల ఆకాంక్ష ఇది. వీరంతా స్థానికంగా క్యాంటీన్ సదుపాయం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ, సంఖ్యా పరంగా ఫీజుబిలిటీ లేకపోవడం వల్ల జాప్యం జరిగింది. కనీసం 10 వేల సైనిక కుటుంబ సభ్యులు ఉండాలన్న నిబంధన ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లా అధిగమించింది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మా దరఖాస్తు మేరకు గాజులరేగ రెవెన్యూ పరిధిలో 40 సెంట్ల స్థలాన్ని అధికారులు గుర్తించారు. అధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. త్వరలోనే స్థలాన్ని అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియ పూర్తికాగానే సైనిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యానే క్యాంటీన్ ఏర్పాటవుతుంది.

? ఎంతమందికి పిఎం స్కాలర్‌షిప్ ఇచ్చారు.?

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో పిఎం స్కాలర్‌షిప్ కోసం ఈ ఏడాది 71 దరఖాస్తులు అందాయి. ఇందులో 61 మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేశాం. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఈ పథకం కింద బాలురుకు రూ.2500, బాలికలకు రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా అందుతున్నాయి. ఇవన్నీ ఏటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

? సైనిక రంగంలో యువత పాత్ర గుర్తించి మీ సందేశమేమిటి.?

ఒకప్పుడు దేశభక్తితో సైనిక దళాల్లో చేరేవారు. వారిలో కనిపించే తెగువ, స్ఫూర్తి, సంకల్పం ఎదుటివారికి ముఖ్యంగా యువతకు ఎంతో ఆదర్శంగా ఉండేది. ప్రస్తుతం అటువంటి విలువలు తగ్గుతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉండడొచ్చు. కానీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కాకుండా దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతో చేరాలనేది నా కోరిక.



పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

విక్టరీ హైస్కూల్లో కరాటే పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో గల శ్రీవిక్టరీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు బ్లాక్ బెల్ట్, ఆరంజ్ బెల్ట్, ఎల్లో బెల్టు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ రాజుచ్, కరాటే కోచ్ శ్రీను ప్రధానోపాధ్యాయులు, పి శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు.

లోక్అదాలత్‌లో 200 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- డెంకాడ

జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు 200 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా కోర్టులో డెంకాడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో సుమారు 200 కేసులు రాజీకి వచ్చాయని చెప్పారు. ఈ విధంగా రాజీయే రాజమార్గమని గౌరవం పడకుండా రాజీ పడాలని ఆయన కోరారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు పాఠశాలలు, వసతి గృహాల్లోనూ చదువుతున్న కిషోర్ బాలికలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఋతుక్రమ సమయంలో తయారయ్యే పోషక పదార్థాలు, ఆకుకూరలు, చక్కలు, బెల్లం, కాయగూరలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు గూర్చి బాలికలకు వివరించారు.



ర్యాలీ చేస్తున్న పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య ర్యాలీను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమన్నారు. వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ తీర్పుపై పున:సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలల ఉద్యోగుల సంఘం నాయకులు కె.చిరంజీవులు, బి.రాము, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

22న ఆనందో బ్రహ్మ

ప్రజాశక్తి- బొబ్బిలి

శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఈనెల 22న ఆనందో బ్రహ్మ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.విజయమోహన్, ఎన్. వేణుగోపాల్ తెలిపారు. కళాభారతి వద్ద ఆదివారం ఆనందో బ్రహ్మ ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. కళలను ప్రోత్సహించేందుకు ఆనందో బ్రహ్మ నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలతో శ్రీవెంకటేశ్వర వైభవం అనే నృత్య రూపకం, శ్రీకృష్ణవేణి డాన్స్ అకాడమీ శాస్త్రీయ నృత్య విలాసం, రేలారేరేలా, రాంప్రసాద్ జానపద నృత్యాలు, ఏబీసీ డ్యాన్స్ అకాడమీ ఫ్లాష్ మాబ్, దాడితల్లి కోలాట ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేబినాయన హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛ భారత మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూపొందించి అమలు చేస్తున్న స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి 15 రోజులపాటు నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 17నఉదయం 7:30 గంటలకు అయ్యకోనేరు వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మనవహారంగా ఏర్పడి చెరువు పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టనున్నారని చెప్పారు. నగరంలో అక్టోబరు ఒకటో తేది వరకు స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత్రదానం ఎంతో గొప్పది

ప్రజాశక్తి-విజయనగరం కోట

తాను మరణించినప్పటికీ మరో ఇద్దరికి చూపునిచ్చే నేత్ర దానం ఎంతో గొప్పదని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు తెలిపారు. ఇటీవల కాలంలో నేత్రదానం పట్ల అవగాహన పెరగడం, పలువురు ముందుకు రావడం అభినందనీయమని ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్నియాల సేకరణపై రోజురోజుకు అవగాహన పెరుగుతుందని చెప్పారు. గత నాలుగు రోజుల్లో మరణించిన ఐదుగురి నుంచి రెడ్‌క్రాస్ ఆప్తాలమిక్ టెక్నీషియన్ రమణ, పది కార్నియాలను సేకరించి, విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించినట్లు తెలిపారు. ఈసందర్భంగా నేత్రదానానికి సహకరించిన కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

వైద్యుల నిర్లక్ష్యం వల్ల నిండు గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం ఇటుకు చెందిన వారాడ నవ్య (24) ప్రసవ నిమిత్తం తన కన్నవారి ఇల్లయిన వీరఘట్టం మండలం దశమంతపురం వచ్చింది. ఈ మేరకు ఆమె తల్లిదండ్రులు ప్రసవ నిమిత్తం వీరఘట్టంలో గల కనోష ఆసుపత్రిలో శనివారం ఉదయం 7గంటలకు చేర్చగా, వైద్యులు సాధారణ ప్రసవమవుతుందని వైద్యులు బంధువులకు తెలిపారు. అయితే సమయం మించిపోవడంతో సాధారణ ప్రసవం జరగదని, ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. వారు చెప్పిన గంటకే నవ్య మృతి చెందింది. ఆమెతో పాటు గర్భంలో ఉనన బిడ్డ కూడా మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. అయితే నవ్య మృతికి వైద్యుల నిరక్ష్యమే కారణమని కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల రెండు ప్రాణాలు పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. భాదితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కళాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - సీతంపేట

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలు పడి ఐటిడిఎకు రావద్దని పిఒ కోరారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

- 2013-18లో నిధులు బొక్కేసిన సర్పంచ్
- రూ.11.88లక్షలు రికవరీ చెయ్యని అధికారులు
- నోటీసులకూ స్పందించని ప్రెసిడెంట్
- ఆన్‌లైన్ ఫిర్యాదుతో మరోసారి తెరపైకి ఆడవరం నిధుల స్వాహా అంశం

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని ఆడవరం గ్రామ పంచాయతీ పూర్వపు సర్పంచ్ కర్నేన పద్మావతి 2013-18నాటి పంచాయతీ పాలనలో నిధులు రూ.11.88లక్షలు దుర్వినియోగం చేశారని గతంలో ఆ గ్రామానికి చెందిన మెయ్యి సూర్యనారాయణ సమాచార హక్కు చట్టం ద్వారా బట్టబయలు చేశారు. అప్పట్లో ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సరిగ్గా ఆరేళ్ల తరువాత మరోసారి మజ్జిరాముడుపేట గ్రామానికి చెందిన కరణం శ్రీనివాసరావు ఇటీవల ఆన్‌లైన్‌లో డిపిఒకు, డిఎల్‌పిఒ, ఇఒపిఆర్‌డికు ఈ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. దీంతో మరోసారి నిధుల స్వాహా అంశం తెరపైకి వచ్చింది.



సిసి రోడ్డు లేని వీధి

ఆడవరం గ్రామ సర్పంచ్ పద్మావతి ఆమె పదవీ కాలం ఐదేళ్లలో నిధులు దుర్వినియోగం చేశారని ఆ గ్రామానికి చెందిన వారే అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి పాలకొండ డిప్యూటీ డిపిఒ సత్యనారాయణ 2020 నవంబర్ 20న ఈ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఇఒపిఆర్‌డికి ఆదేశించారు. రికార్డులు పరిశీలించి కొన్ని పనులకు ఓచర్లు లేవని ఇఒపిఆర్‌డి గుర్తించారు. నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ కర్నేన పద్మావతిని పంచాయతీ కార్యదర్శి, ఇఒపిఆర్‌డి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. కానీ సర్పంచ్ వాటికి స్పందించలేదు. రెండోసారి నోటీసు పంపిన విచారణకు హాజరుకాలేదు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 13వ ఆర్థిక సంఘం నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి క్యాష్ పుస్తకాలలో నమోదు ప్రాప్తికి నిధులు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. వాటికి కూడా పనులకు సంబంధించిన ఓచర్లు లేవని రుజువైంది. ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీకి ఇచ్చిన రూ. 7లక్షలు అభివృద్ధి కోసం అందజేసిన నిధులు 2016 జనవరి 5 నుంచి 2016 ఏప్రిల్ 20 వరకు పారిశుధ్యం, ఎలక్ట్రికల్, బోరు మెటీరియల్, బ్లీచింగ్ కొనుగోలుకు ఓచర్లు లేవని గుర్తించారు. 7లక్షలకు గాను రూ.2.50లక్షలు పనులు చేయగా రూ.4.50 లక్షలకు సంబంధించి ఎటువంటి పనులు చేయకుండా పూర్వపు సర్పంచ్ పద్మావతి చేతి వాటం చూపించి విత్‌డ్రా చేసినట్లు వెల్లడైంది. శాశ్వత అభివృద్ధి పనులకు మాత్రమే ఇంజినీరింగ్ అధికారులు ఎంబుక్ రికార్డు చేసి ఉన్నారని, నూతనంగా ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



అభివృద్ధికి నోచుకోని ఆడవరం గ్రామం

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు అందింది.

ఆడవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ కర్నేన పద్మావతి 2013-18సర్పంచ్ పదవీ కాలంలో నిధులు దుర్వినియోగం పట్ల ఈ ఏడాది ఆగస్టు 27న ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడతాం. అప్పటి జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి విచారణ చేపట్టిన నివేదికలు ఆధారంగా ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టవలసి ఉంది.

ఏవి సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి, రేగిడి


వైసిపి నాయకుల చూపు.. జనసేన, టిడిపి వైపు

ప్రజాశక్తి - డెంకాడ

మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మండలంలోని వైసిపి నాయకుల జనసేన, టిడిపి వైపు చూస్తున్నారు. మండలం ఒకప్పుడు టిడిపికి కంచుకోటగా ఉండేది. దీంతో మండల వ్యవస్థ ఏర్పడిన దగ్గర నుంచి మూడు పర్యాయాలు టిడిపి ఎంపిపిని కైవసం చేసుకోగా మధ్యలో ఒకసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో వైసిపి ఎంపిపి పదవిని దక్కించుకుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వైసిపి నాయకులు టిడిపి, జనసేనలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిస్తోంది. వైసిపి అధికారంలో లేకపోవడంతో పనులు జరగడం లేదని అదే టిడిపి, జనసేనలో చేరితే పనులు చకచక జరుగుతాయన్న ఆలోచనతో ఆ పార్టీల వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా మండలంలో వైసిపిలో బలంగా ఉన్న నాయకులతో పాటు మండల స్థాయిలో ఉన్న ఇద్దరు ముగ్గురు పదవుల్లో ఉన్న ముఖ్యమైన నాయకులు కూడా జనసేన వైపు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. వారు కాకుండా నలుగురైదుగురు ఎంపిటిసిలు, 7, 8 మంది సర్పంచులు ఇతర నాయకులు పార్టీ మారుతారని ప్రచారం జరుగుతోంది. వైసిపి ప్రభుత్వంలో పదవులున్నా ఆర్థికంగా బాగా నష్టపోయామని ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలోకి వెళితే ఎంతో కొంత ఆర్థికంగా బలపడవచ్చునన్న ఉద్దేశంతో జనసేన పార్టీలోకి వెళ్తున్నట్టు తెలుస్తుంది. ఇదే జరిగితే ఈ మండలంలో వైసిపికి గట్టి ఎదురు దెబ్బ తగిలేడం ఖాయమని తెలిస్తోంది. అయితే ఎంతమంది పార్టీ ఫిరాయిస్తారో తెలియాల్సి ఉంది.

17న జనసేనలోకి 'చనమల్ల'

నెల్లిమర్ల: వైసిపి సీనియర్ నాయకులు, ఆ పార్టీ మండల అధ్యక్షులు చనమల్ల వెంకటరమణ జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న తన అనుచరులు, వైసిపి నాయకులతో కలిసి జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ముఖ్యంగా జనసేన అధినేత డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, పాలన తీరు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తనతో బాటు నగర పంచాయతీ కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, జనా సంధ్యారాణి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జనా ప్రసాద్, మాజీ ఎంపిటిసి పాండ్రంకి మహాలక్ష్మి, గుషిణి ఎంపిటిసి చనమల్ల స్వాతి, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు కూడా జనసేనలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మార్గదర్శకత్వంలో జన సేన పార్టీని మరింత బలోపేతం చేసే ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, జన సేన మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అచ్చుంనాయుడు, జనసేన నాయకులు ఎంఎం నాయుడు, బంగారు శంకర రావు, పతివాడ గోవిందరావు, పాండ్రంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చనమల్ల వెంకటరమణ



మొక్కలు నాటుతున్న సిఐ, ఎస్ఐ

మొక్కలు నాటిన పోలీసులు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో భోగాపురం సిఐ రామకృష్ణ ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే బాధ్యత పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. మొక్కలు పర్యావరణానికి ఎంతో ఉపయోగపడతాయని వాటిని సంరక్షించడం మన బాధ్యతని తెలిపారు. ఇప్పుడు నాటిన మొక్కలు భావితరాలకు ఎంతో ఉపయోగపడతాయని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, రామ్మూర్తి, పోలీసులు పాల్గొన్నారు.

నా మాటే ఎమ్మెల్యే మాట

- నేను చెప్పిందే ఆమెకు వేదం - బదిలీలపై ఉద్యోగులను భయపెడుతన్న గ్రామస్థాయి నాయకుడు

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తుంది. దీంతో బదిలీలపై ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరిని బదిలీ చేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలోని ఒక గ్రామ స్థాయి నాయకుడు కలుగజేసుకుని నా మాటే ఎమ్మెల్యే మాట నేను చెప్పిందే ఎమ్మెల్యే చేస్తారు. నా మాటే వేదవాక్కు ఎమ్మెల్యే భర్త నేను చెప్పిందే చేస్తారు. వారిది మాది ఒకే కులం కాబట్టి నా మాటకి ఎదురు లేదు అని ఉద్యోగులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఉద్యోగుల బదిలీల విషయాన్ని కూడా ఎమ్మెల్యే తనకే అప్పగించారని తాను చెప్పిన చోటకే బదిలీలు జరుగుతాయని చెబుతూ డబ్బులు దండకం కూడా మొదలు పెట్టేశాడని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

మండలంలోని బొడ్డవలస పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒక గ్రామ స్థాయి నాయకుడు అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులకు ఫోన్ చేసి మీరు ఉంటారా వెళ్ళిపోతారా ఉంటానన్న, వెళ్లిపోతానన్నా తనకు చెప్పాలని బెదిరిస్తున్నాడు. ఉంటే పోస్టుకు బట్టి ఒకరేటు వెళ్లిపోతానంటే ఇంకో రేటు అని చెబుతున్నాడు. ఇలా కొంతమంది దగ్గర డబ్బులు కూడా కలెక్ట్ చేశాడని కొంత మంది ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఇంతకు ఆ వ్యక్తి జనసేన నాయకుడా, టిడిపి నాయకుడా అని అధికారులు వాళ్లలో వాళ్లు చర్చించుకుంటున్నారు. ఈ నాయకుడు ఎలక్షన్ వరకు టిడిపి నాయకుడనని చెప్పుకు తిరిగేవాడు, ఇప్పుడు జనసేన నాయకుడునని చెప్పుకుంటున్నాడని పలువురు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల ఎమ్మెల్యేకి ఆమె భర్తకి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని జనసేన నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఈ గ్రామస్థాయి నాయకుడిని అదుపులో పెట్టాలని ఉద్యోగస్తులు కోరుతున్నారు.

ఇన్నోవేటివ్ ఇంజినీరింగ్ కీలకం

ప్రజాశక్తి- డెంకాడ

విద్యార్థులకు, పరిశ్రమలకు, దేశానికి ఇన్నోవేటివ్ ఇంజినీరింగ్ కీలకమని హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డి. శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవితంలో ప్రతి అంశంలోనూ ఇంజినీరింగ్‌కు ప్రాముఖ్యత ఉందన్నారు. ఇంజినీర్‌గా హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఇంజినీరింగ్ డిజైన్, రక్షణ రంగం, చమురు వ్యాపార సంస్థలకు నౌకల తయారీ సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సపోర్టర్ ఎన్‌వి రామారావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. హరిబాబు, కెవి. నరసింహం, డీన్ ప్రకాష్‌బాబు, బి. శ్రీధర్, అన్ని విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

ప్యాసింజర్ రైళ్లు వేయండి: సిపిఎం

ప్రజాశక్తి- బొబ్బిలి

విశాఖపట్నం విజయనగరం పార్వతీపురం జిల్లాలు వెనుకబడిన జిల్లాలని ఈ జిల్లాల నుంచి రోజు విశాఖకు విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యం నిమిత్తం వేలాది మంది ప్రజలు రాకపోకలు చేస్తుంటారని లోకల్ పాసింజర్ ట్రైన్లు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతాలకు సరిపడా రైళ్లు లేక వేలాడుతూ కిక్కిరిసి జనరల్ బోగీలో ప్రయాణం చేస్తున్నారని విశాఖపట్నం నుండి పార్వతిపురం వరకు లోకల్ ట్రైన్లు వేయాలని ప్రజలు నెత్తి నోరు కొట్టుకుంటే మోడీ ప్రభుత్వం మన ప్రాంతానికి ఏ మాత్రం ఉపయోగపడని వందే భారత్ రైలు విశాఖపట్నం - దుర్గ్‌కు వేయడం సమంజసం కాదని అన్నారు. ఈ ట్రైన్ కేవలం వాళ్ల ప్రభుత్వం ఉన్న ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి తప్ప మనకి ఏమాత్రం ఉపయోగపడదని చెప్పారు. మన రాష్ట్రం మోడీ ప్రభుత్వానికి ఎంత చులకనగా కనిపిస్తోందో దీనిని బట్టి అర్థమవుతోం దన్నారు. ఈ లగ్జరీ ట్రైను కేవలం వ్యాపారస్తులకు ఉన్నత వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. దాని ధరలు సామాన్య ప్రజలు భరించలేరని అన్నారు. విశాఖపట్నం, విజయనగరం ఎమ్‌పిలు, ఈ మూడు జిల్లాల ఎమ్మెల్యేలు ఈ మూడు జిల్లాల ప్రజల మీద ఏమాత్రం గౌరవం ఉన్న తక్షణమే విశాఖపట్నం నుంచి పార్వతీపురం వరకు లోకల్ పాసింజర్ రైలు నడిపే విధంగా కేంద్రం పైన ఒత్తిడి తేవాలని కోరారు. ఈ మూడు జిల్లాల మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచే విధంగా రైల్వే శాఖపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలం, పట్టణ నాయకులు బంగారు యుగంధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిఎం సహాయనిధికి విరాళాల వెల్లువ

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. వరద బాధితులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే బేబినాయన పిలునివ్వడంతో విరాళాలు ఇచ్చేందుకు అన్ని రంగాల ప్రజలు ముందుకు వస్తున్నారు. కింతలవానిపేట గ్రామస్తులు రూ.15వేలు, ఆనవారం గ్రామానికి చెందిన టి.సత్యనారాయణ రూ.5వేలు, కారాడ గ్రామానికి చెందిన ఆర్యవైశ్యులు రూ.25వేలు, సాయిశంకర ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్ రూ.20వేలు, సుందరాడ గ్రామస్తులు రూ.50వేలు, నెమలాం టిడిపి కమిటీ రూ.10వేలు, విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.మాసిలామణి రూ.20వేలు, ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు రూ.10వేలు, వై.ప్రసాద్, పి.నానివాణిప్రసాద్ రూ.10వేలు, ఎస్.చిట్టిబాబు రూ.5వేలు, జె.విక్టర్ రూ.5వేలు, జె.వినయ్ రూ.5వేలు, పి.అప్పయ్య రూ.2వేలు, ఎస్.ప్రసాద్ రూ.వెయ్యి, కోటశిర్లామ్ టిడిపి నాయకులు రూ.30వేలు, కొండకెంగువ టిడిపి నాయకులు రూ.25వేలు, పాతరేగ టిడిపి నాయకులు రూ.10వేలు, జికెఆర్ పురం నాయకులు రూ.20వేలు, వీరసాగరం నాయకులు రూ.20వేలు విరాళాలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు ఇచ్చిన వారిని ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు



విరాళాలు ఎమ్మెల్యేకు అందిస్తున్న దాతలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం లక్కవరపుకోట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి గొల్లలపాలెం సర్పంచ్, గ్రామ టిడిపి నాయకులు, ప్రజలు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటింటికి కొళాయి ఇవ్వాలని, స్కూల్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలని, అంగన్వాడి భవన నిర్మాణం, రేషన్ అందుకోవాలంటే వియ్యంపేట గ్రామం వెళ్లాల్సి వస్తుందని గొల్లలపాలెం గ్రామానికి సొంతంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మాణం, డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, స్కూల్ నిర్మాణం కోసం ఇచ్చిన భూమిని వైసిపి ప్రభుత్వంలో జగనన్న కాలనీల కోసం ఇవ్వడం జరిగిందని ఆ భూమిని మళ్లీ స్కూల్ నిర్మాణానికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లలపాలెం గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సర్పంచ్ తీరుపై జనసేన ఫైర్

శృంగవరపుకోట : వైసిపి నేత ఇందుకూరి రఘురాజు బర్త్‌డే సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలు తొలగింపులో ఎస్‌కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోషి కుమారి ముఖ్యపాత్ర వహించారని జనసేన నాయకులు ఫైర్ అయ్యారు. ఆదివారం పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో జనసేన నాయకులు సురేష్ రాజు ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి సర్పంచ్ తీరుపై మండిపడ్డారు. పంచాయతీ పరిధిలో గల కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలంటే చలానా తీయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు సర్పంచ్‌కు గుర్తురాని చలానా రఘురాజు బర్త్‌డే ముందు రోజే గుర్తుకు రావటం ఏమిటని ఇది కక్షపూరితంగానే ఆమె చేయించారని ఇది స్థానిక నేతల మధ్య చిచ్చుపెట్టే అంశమని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.

బానాదిలో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో శనివారం రాత్రి నీలకంఠ రాజపుర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బానాదికి చెందిన పిల్లలు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరు కావడం లేదన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు రాకపోవడం వల్ల నష్టం జరుగుతోందని ప్రత్యేక తరగతులకు పిల్లలు హాజరయ్యేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నేరాలు ఘోరాలు

బంగారం దుకాణంలో చోరీ

భారీగా నగదు, వెండి అపహరణ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గొట్లాం గ్రామ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సిద్ధి వినాయక బంగారు నగల దుకాణంలో ఆదివారం వేకువ జామున చోరీ జరిగింది. బంగారు వస్తువులతో పాటు కొంత నగదు, వెండి వస్తువులు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపూడి సత్తిబాబు బంగారం దుకాణం నడుపుతున్నాడు. యధావిధిగా ఆదివారం దుకాణం దగ్గరకు చేరుకోగా, దుకాణం షట్టర్ సగం వరకు విరగ్గొట్టి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగినట్లు గుర్తించి బొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి ఎస్ఐ యు.మహేష్, గజపతినగరం సిఐ ఎస్‌వి రమణలు చేరుకుని దుకాణాన్ని పరిశీలించారు. విజయనగరం నుంచి డాగ్ స్క్వాడ్‌ను తెప్పించి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. దుకాణం షట్టర్‌ను రెండు గుణపాలతో సగానికి పైగా ఎత్తివేసి చోరీ పూర్తయిన తరువాత దుకాణం తాళాలను, గుణపాలను దగ్గరలో ఉన్న తుప్పల్లో వేరువేరుగా పడివేసినట్టు పోలీసులు గుర్తించారు. దుకాణంలో సిసి కెమెరాలను కూడా పనిచేయకుండా చేసే ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. దుకాణం యాజమానిని విచారించగా రూ.70 వేలు నగదు, 33 తులాలు వెండి, 2 తులాలు బంగారం అపహరించుకుపోయినట్లు పోలీసులకు తెలిపాడు. అనంతరం పోలీసులు స్థానికులను విచారించారు. దొంగతనం జరిగిన విధానాన్ని అన్ని కోనాల్లో దర్యాప్తు చేస్తామని ఎస్ఐ మహేష్ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు